క్లుప్తంగా

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు



ఓపీ రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పాలకొండ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు సిబ్బందికి సూచించారు. పట్టణంలోని గాయత్రి చిన్నపిల్లల ఆస్పత్రిని సోమవారం సందర్శించారు. ఆస్పత్రిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై డీఎంహెచ్ఓ కార్యాలయానికి ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలని సూచించారు. నోటిఫైడ్ వ్యాధుల పట్ల అప్రమంత్తగా ఉండాలన్నారు. అతిసారం, మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలను ఎప్పటికప్పుడు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికిసూచించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



నల్లరాయిగూడలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న అధికారులు

భామిని: మండలంలోని నల్లరాయిగూడలో సోమవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. బాలేరు వైద్యాధికారి దీపికారాణి, ఈఓపీఆర్డీ జి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఏసీఎం 5 శాతం ద్రావణం పిచికారీని ప్రారంభించారు. గ్రామంలోని ప్రతీ ఇంట్లో, ఇంటి ఆవరణంలో ఈ మందును పిచికారీ చేయించారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్తులను అప్రమత్తం చేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల వ్యాప్తికి కారణమైన దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సబ్ యూనిట్ అధికారి పి.అప్పారావు సూచించారు.

నేడు భీంపురం వంతెన పనులకు శంకుస్థాపన

కురుపాం: మండలంలోని ఒబ్బంగి పంచాయతీ భీంపురం వద్ద వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మంగళవారం శంకుస్థాపన చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

15 మంది సీఆర్టీలకు రెన్యువల్

సీతంపేట: స్థానిక ఐటీడీఏ పరిధిలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 15 మంది సీఆర్టీలను రెన్యువల్ చేసినట్టు గిరిజన సంక్షేమశాఖ డీడీ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఎస్‌జీటీ ఖాళీల్లో వారిని భర్తీ చేసినట్లు చెప్పారు. కొద్ది రోజుల కిందట స్కూల్ అసిస్టెంట్ సీఆర్టీలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు.

విస్తారంగా వర్షాలు



గురువుగారి వీధిలో రోడ్డుపై చేరిన వర్షపునీరు

పాలకొండ రూరల్: గడిచిన 24 గంటలుగా మండల వ్యాప్తంగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక ఎండిపోతున్న వరిచేను, నారుమడులకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంత పొలాల్లో నీరు చేరడంతో దుక్కులు చేపట్టి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మరోవైపు వర్షాలకు రోడ్లపై కొంతమేర నీరు చేరడంతో పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

డీలర్ పనితీరుపై ఆరోపణలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని జర్న పంచాయతీ బబ్బిడి గ్రామంలో ఉన్న డీఆర్ డిపోలో పనిచేస్తున్న డీలర్‌ను మార్చాలని కార్డుదారులు పువ్వల కోటేశ్వరరావు, కిల్లక సతీష్ తదితరులు సోమవారం డిమాండ్ చేశారు. రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టడం లేదని, డీలర్ చర్యలతో గిరిజన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశార. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు సూచించినా ఏమాత్రం మార్పురాలేదని, అతన్ని వేరే చోటకు బదిలీ చేసి మరొకరిని నియమించాలని అధికారులను కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వాహనాల వేలం నేడు

పార్వతీపురం: వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 54 ద్విచక్ర వాహనాలు, 10 ఆటోలు, రెండు కార్లకు మంగళవారం బహిరంగ వేలం వేసేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు సీఐ ఎల్.ఉపేంద్ర సోమవారం తెలిపారు. ఆసక్తి గలవారు రూ.2వేల ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- డ్వామా పీడీ కె.రామచంద్రరావు
- సామాజిక తనిఖీలపై ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ రామచంద్రరావు, తదితరులు

కురుపాం: ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని డ్వామా పీడీ కె.రామచంద్రరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఎంపీడీఓ వి.శివరామప్ప ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా చేపట్టిన పనులకు సంబంధించిన నివేదికలను ఎస్ఆర్‌పీలు ఎం.తిరుపతిరావు, ఎం.గోవింద్ చదివి వినిపించారు.

మండలంలోని 23 పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ శాఖల ద్వారా మొత్తం 2,274 పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రూ.14,73,55,508లు ఖర్చు చేసినట్లు గుర్తించారు. ఇందులో రూ.11,77,03,875లు వేతనదారులకు చెల్లించగా, మెటీరియల్స్ కోసం రూ.2,96,51,637లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. పలు పంచాయతీల్లో చేపట్టిన పనులను ఏడాది కాలంగా రికార్డుల్లో నమోదు చేయకపోవడం, కొలతల్లో తేడాలు ఉన్నట్లు సామాజిక తనిఖీల్లో వెలుగు చూడటంతో సంబంధిత సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని వెంటనే సరిచేయాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో వేతనదారులు పనులు కావాలని కోరితే 365 రోజులపాటు జాబ్‌కార్డులు ఉన్న ప్రతీ ఒక్కరికి పనులు కల్పించాల్సి బాధ్యత ఉపాధిహామీ సిబ్బందిదేనన్నారు. ఇదిలా ఉండగా ఏడాది పాటు జరిగిన పనుల్లో ఏ మేరకు నిధులు సద్వినియోగం అయ్యాయి? లేక దుర్వినియోగం అయ్యాయా అన్నదానిపై ఇంకా సామాజిక తనిఖీ బృంద సభ్యులు తెలపాల్సి ఉంది. ప్రజావేదికలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఏపీడీలు జి.శ్రీహరి, ఆర్.సురేష్‌నాయుడు, ఏపీఓ బావాజీ, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



వైద్య సేవలను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ భాస్కరరావు

గరుగుబిల్లి: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆర్‌బీకే ప్రోగ్రాం అధికారి, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ దవళ భాస్కరరావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రికార్డులు, సిబ్బంది పనితీరు, మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు అవసరమైన రక్త పరీక్షలు చేయాలని సూచించారు. రక్తహీనత నివారణపై దృష్టిపెట్టాలని, రక్తహీనతతో బాధపడుతున్నవారికి ఐరన్ మాత్రలను సకాలంలో అందించాలన్నారు. రోగులతో సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. ఆయన వెంట డాక్టర్ సాగర్‌వర్మ, పీఏ ప్రియాంక తదితరులున్నారు.

నేడు 'జగనన్న సురక్ష' శిబిరం

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల, తెట్టంగి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, తహసీల్దార్ చందక సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

రెల్ల, లుంబేసులో..

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రెల్ల గ్రామ సచివాలయంలో తహసీల్దార్ జె.రాములమ్మ ఆధ్వర్యంలో, లుంబేసు గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు వివిధ రకాల సేవలకు సంబంధించి ధ్రువపత్రాలు మంజూరు చేయనున్నారు.

కంటి ఆపరేషన్లకు అవ్వాతాతల తరలింపు



నేత్ర శస్త్రచికిత్సల కోసం తరలిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపికైన అవ్వాతాతలను ఆస్పత్రికి తరలించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. కురుపాం సీహెచ్‌సీ నుంచి సోమవారం 40 మందిని తగరపువలసలోని ఎన్ఆర్ఐ కంటి ఆస్పత్రికి తరలించారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో గతంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో కేటరాక్ట్ (అంతరకుసుమం), టెరిజియం (కొయ్యకండ) సంబంధిత నేత్ర సమస్యలతో బాధపడుతున్న పలువురుని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వారిని ప్రత్యేక బస్సులో ఆస్పత్రికి తరలించారు. ఉచితంగా కంటి ఆపరేషన్‌తో పాటు మందులు, కళ్లద్దాలు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నేత్రవైద్య సహాయకులు శైలజ, రోజ, మల్లిక, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మెనూ కచ్చితంగా అమలు చేయాలి



హెచ్ఎంను ప్రశ్నిస్తున్న ఎంపీడీఓ

గరుగుబిల్లి: పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. మండలంలోని రావుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూ అమలు చేయడం లేదంటూ అందిన ఫిర్యాదుపై ఎంఈఓ నాగభూషణరావుతో కలిసి సోమవారం విచారణ చేపట్టారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. మెనూ అమలును ఎందుకు పర్యవేక్షించడం లేదంటూ హెచ్ఎం జోషఫ్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్ల తెలిపారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోండి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఏరియా మేనేజర్ చంద్రమౌళి

గరుగుబిల్లి: స్త్రీనిధి రుణాలతో మహిళా సంఘ సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పార్వతీపురం మన్యం జిల్లా స్త్రీనిధి ఏరియా మేనేజర్ టి.చంద్రమౌళి అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి రూ.6 కోట్లు చొప్పున స్త్రీనిధి రుణాల మంజూరు లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఆ మేరకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి, సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని ఏపీఎం అప్పలనాయుడుకు సూచించారు. ఇంతవరకు రూ.3 కోట్లు రుణాలను మంజూరు చేయడం జరిగిందని, మిగిలిన రూ.3 కోట్లు మార్చిలోగా మంజూరు చేయనున్నట్లు చెప్పారు. గతంలో మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి కింద రూ.50 వేలు రుణాలు అందజేయగా, ప్రస్తుతం రూ.లక్ష మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

క్షయరోగులకు పోషకాహార కిట్లు పంపిణీ



పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్, తదితరులు

సీతంపేట: ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో సోమవారం క్షయరోగులకు ఆర్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్షయ వ్యాధితో బాధపడుతున్న 60 మంది రోగులకు ఈ కిట్లు అందజేశారు. అందులో బియ్యం, పప్పులు, నూనె, వేరుశనగ, ఎండు ఖర్జూరం, బాదం పప్పు వంటి ఏడు రకాల పౌష్టిక పదార్థాలతో పాటు రూ.500లు ఉన్నాయి. కార్యక్రమంలో ఆర్డ్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ శ్రీరామ్మూర్తి, ఆర్ఎంఓ గౌరీశంకర్, వెంకటరావు, సమన్వయకర్త శంకరరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు విధానం ఎంతో మేలు



ద్రవజీవామృతం తయారీని వివరిస్తున్న గోవిందరావు, ప్రభాకరరావు

భామిని: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా భూమికి, రైతుకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం ఎల్ఐ గోవిందరావు, ఐసీఆర్‌పీ ప్రభాకరరావు అన్నారు. మండలంలోని నులకజోడులో సోమవారం ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. గోమూత్రం, పేడ, బెల్లం, పుట్టమట్టి, పిండి, నీటితో ద్రవజీవామృతం తయారీని వివరించారు. ఈ కషాయాన్ని పంటలకు పిచికారీ చేయడం ద్వారా చీడపీడలను సమర్థవంతంగా నిర్మూలించవచ్చన్నారు. రసాయన ఎరువుల కోసం అధికంగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదన్నారు. తక్కువ వ్యయంతో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విజ్ఞాన మందిరం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

పాలకొండ: డివిజన్ కేంద్రంలో అంబేడ్కర్ విజ్ఞాన మందిరాన్ని నిర్మించాలని దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు నగరపంచాయతీ కార్యాలయంలో కమిషనర్ సర్వేశ్వరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు నూతలపాటి భరత్‌భూషన్, బత్తిన మోహనరావు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా అంబేద్కర్ విజ్ఞాన మందిరంపై అధికారులకు వినతులు అందిస్తున్నామని, కానీ ఇంతవరకు వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గురుబిల్లి రవికుమార్, తిర్లంగి ఉపేంద్రకుమార్, భోగి విశ్వేశ్వరరావు, పాట్నూరు రమేష్, సురేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు భూమి పూజ

సీతానగరం: గ్రామాలకు అనుసంధాన రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న గురాలబీట్ నుంచి గాదెలవలస (9.1 కి.మీ) వరకూ రూ.1.96 కోట్లతో బీటీరోడ్డు అభివృద్ధి పనులకు ఏగోటివలస వద్ద ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల గాదెలవలస, దయానిధిపురం, రంగంపేట, లక్ష్మీపురం గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల ప్రజల కోరికమేరకు ఏగోటివలస మీదుగా గాదెలవలస గ్రామం వరకు గల 9.1 కిలోమీటర్ల బీటీ రహదారి అభివృద్ధి పనులకు పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధుల నుంచి రూ.1.96 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడంతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. అలాగే పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి నిధులను నియోజకవర్గంలోని సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం మండలాల్లో గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్ల అభివృద్ధికి మంజూరు చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి. శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పార్టీ నాయకులు మాజీ జెడ్పీటీసీలె అంబటి కృష్ణంనాయుడు, టి.వెంకటప్పలనాయుడు, పీఆర్ డీఈ (ప్రాజెక్ట్స్) బి. సన్యాసిరావు, ఏఈ శంకర్రావు, వలంటీర్లు పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భాస్కరరావు

గుమ్మలక్ష్మీపురం: అటవీ భూములు ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని గుమ్మలక్ష్మీపురం అటవీశాఖ సెక్షన్ అధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. ఈమేరకు సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..ఇటీవల ఎల్విన్‌పేట పంచాయతీ పరిధిలో అటవీశాఖకు చెందిన (వన సంరక్షణ సమతి) స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, అది సరైన చర్య కాదన్నారు. ఆ స్థలం అటవీశాఖ ఆధీనంలో ఉందని, ఆక్రమించేందుకు ఎవరు ఉపక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆయనతో పాటు బీట్ ఆఫీసర్లు తిరుమల, రామారావు ఉన్నారు.

గిరిజన స్పందనకు 97 వినతులు



వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏలో ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 97 వినతులు వచ్చాయి. తాగునీటి సమస్య పరిష్కరించాలని రేగులగూడ కాలనీకి చెందిన సవర సింహాచలం, సీఆర్టీ పోస్టు ఇప్పించాలని దొండమానుగూడకు చెందిన సవర సూర్యం, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని సన్యాసిపేట గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మసాన పుట్టికి చెందిన కె.వెంకటేష్ గ్రామంలో జీపీఎస్ స్కూల్ మరమ్మతులు చేపట్టాలని కోరారు. కొండపోడు పట్టాలో తప్పులను సరిచేయాలని మెట్టూరుగూడకు చెందిన సవర కృష్ణవేణి వినతి ఇచ్చారు. దొండమానుగూడకు చెందిన సింగమ్మి నాటుకోళ్ల పెంపకం లోన్ మంజూరు చేయాలని, ఆటోలోన్ ఇప్పించాలని బాలేరుకు చెందిన బుజంగరావు, కిరాణాషాపు లోన్ మంజూరు చేయాలని బానాపురం గ్రామస్తుడు రమణరావు దరఖాస్తు చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి ఏఎంఓ కోటిబాబు, సీడీపీఓ రంగలక్ష్మి, హెచ్ఓలు జయశ్రీ, ఆయంతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులు కాపాడాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

పాలకొండ/పాలకొండ రూరల్: గిరిజనుల హక్కులు, రిజర్వేషన్లు కాపాడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకుడు ఎం.తిరుపతిరావు అన్నారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో సంఘం మండల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు పండించిన పంటలకు మద్దతు, గిట్టుబాటు ధర కల్పించాలని, పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, గతంలో తప్పుల తడకలతో ఇచ్చిన పట్టాలను సరిచేయాలని తిరుపతిరావు డిమాండ్ చేశారు. వాటితో పాటు ఆదివాసీ గిరిజనుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని ప్రభుత్వాలను కోరారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.గంగయ్య, ప్రధాన కార్యదర్శిగా పి.వాసు, ఉపాధ్యక్షులుగా వి.సింహాచలం, ఎ.ఒరియా, కార్యదర్శులుగా ఎస్.సురేష్, చిన్నారావు, ఎస్.అనూష, శాంతి, కోశాధికారిగా ఎస్.రమేష్ తదితరులు ఎన్నికయ్యారు.

ఏపీ పీఆర్ ఎంఈ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టిరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీ పీఆర్ ఎంఈ) పాలకొండ సమితి నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకుడు కె.నాగభూషణరావు, రణస్థలం రికార్డు అసిస్టెంట్ కేఆర్‌కే మురళీకృష్ణ పట్నాయక్ నేతృత్వంలో ఈ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా డి.రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా డొంక త్రినాథులు, ప్రధాన కార్యదర్శిగా ఎ.ధర్మారావు, సంయుక్త కార్యదర్శిగా కె.గురుగోవింద, కోశాధికారిగా పి.కిశోర్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.వెంకటేశ్వరరావు, సీహెచ్.తవిటినాయుడు, కె.విజయలక్ష్మి, టి.ప్రభావతి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, కార్యాలయ సూపరింటెండెంట్ డి.త్రినాథులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

108 సేవలు విస్తృతం చేయాలి



108 ఈఎంటీలకు శిక్షణ ఇస్తున్న ఏఈఎంఎస్ మేనేజర్ మన్మథరావు

పాలకొండ రూరల్: 108 అంబులెన్సుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆ సంస్థ ఏఈఎంఎస్ మేనేజర్ ఎస్.మన్మథనాయుడు అన్నారు. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో 108 ఈఎంటీలకు సాంకేతిక వినియోగం, నూతన పోకడలపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంస్థ ఓఈ బి.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఓజేటీ ఆలుబిల్లి శ్రీనివాసరావు 108 వాహనంలో బేసిక్ ఎయిర్వే మేనేజ్‌మెంట్, ట్రోమా ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ద్వారా రోగికి రక్షణ కల్పించే విధానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణకు నూతనంగా సమకూర్చిన 108 వాహనాల ద్వారా సేవలు విస్తృతం చేసేందుకు ఈ తరహా శిక్షణలను సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని 22 మంది ఈఎంటీలు పాల్గొన్నారు.

అంతిమ యాత్రలో అవస్థలు



వర్షంలో తడుస్తూ అంతిమ సంస్కారాలు చేస్తున్న గ్రామస్తులు

భామిని: మండలంలోని లోహరిజోల గ్రామంలో శ్మశానవాటికలో కనీస వసతులు లేకపోవడంతో అంతిమ సంస్కారాల సమయంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన వృద్ధుడు అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. జోరువాన కురుస్తుండడంతో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడం కష్టంగా మారింది. గొడుగులు చేతపట్టుకుని వర్షంలోనే దహన సంస్కారాలు చేయాల్సి వచ్చింది. శ్మశానవాటికలో కనీస వసతులు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు స్పందించి శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మీనామృతంతో చీడపీడల నివారణ

జియ్యమ్మవలస: మండలంలోని టీకేజమ్ములో సేంద్రియ వ్యవసాయంపై రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. మీనామృతం తయారీ, దాని ఉపయోగాలను రైతులకు వివరించారు. చేపల వ్యర్థాలు, బెల్లంతో తయారు చేసిన మీనామృతాన్ని పిచికారీ చేయడం ద్వారా చీడపీడల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిట్ సిబ్బంది అల్లు సూర్యనారాయణ, ఐసీఆర్పీలు మోహనరావు, కృష్ణబాబు, బెలగాపు గౌరయ్య, రైతులు పాల్గొన్నారు.